
**1**-1-2007 న హోటల్ 'హరిప్రియ'లో సాయంత్రం ఆరు గంటలకు 'ఆత్మీయులకు సత్కారం'. రాత్రి ఎనిమిది గంటలకు విందు. తప్పక విచ్చేయండి. గమనిక: చక్కని సాంస్కృతిక కార్యక్రమం కూడా ఉంటుంది.

ఈ ఆహ్వానపత్రికను తన బంధుమిత్రుల కు, పరిచయస్థులకూ పంచాడు గోపి. విభిన్నం గా ఉన్న ఆ ఆహ్వానాన్ని చూసి, అందరూ "ఎవరికీ సత్కారం...? ఎందుకు...?" అని అడిగారు. "అంతా సస్పెన్స్. అందరూ అక్కడికి వచ్చి తెలుసుకోవలసిందే" నంటూ వారందరికీ ఒకే



# ఔచిత్యం

సమాధానం ఇచ్చాడు గోపి.

"అమ్మా, నాన్నా... ఫస్ట్ తారీకున ఒక ఫంక్షన్ ఉంది..., ఆ రోజుకు మీరిద్దరూ కొత్త బట్టలు కొనుక్కోండి..." అంటూ డబ్బు ఇచ్చాడు గోపి. 'ఫంక్షనేమిటి...?, బట్టలు కొనుక్కోవడమేమిటి...?" అయోమయంగా అడిగారు ఇద్దరూ. "అదంతా తరువాత చెప్తాను. బట్టలు మాత్రం మంచివి తెచ్చుకోండి. ఎల్లుండే కదా ఫంక్షన్..." అన్నాడు. "ముందు నువ్వు చెప్పకపోతే తెచ్చుకోము" అన్నారు జంటగా. "తెచ్చుకుంటారు, నాకు తెలుసు. నా మాట మీరెప్పుడు కాదన్నారు కనుక...!" అంటూ టైమ్ అవుతున్నదని హడావుడిగా షాపుకి వెళ్ళిపోయాడు గోపి.

కొత్త సంవత్సరం... మొట్టమొదటి రోజు. సాయంకాలం. వాతావరణం చల్లచల్లగా, హాయిగా ఉంది. ప్రత్యేక దిన ప్రభావమేమో అందరి మనసులూ ఉల్లాసంగా, ఉత్తేజంగా ఉన్నాయి. కుదరని వాళ్ళు కూడా హోటల్ హరిప్రియకు వచ్చారు వీలు చేసుకుని, ఉత్కంఠ ఆపుకోలేక. ఫంక్షన్ హాల్ డెకరేషన్ అట్టహాసంగా ఉంది. ఎంట్రన్స్‌లో టేబుల్ దగ్గర నిలబడ్డ ఇద్దరు అందమైన అమ్మాయిలు వచ్చిన వారికి స్వాగతం చెప్తూ గులాబీలు అందిస్తున్నారు. హాల్లో అలంకరించిన పూలు సౌందర్యాతిశయంతో మిడిసిపడుతున్నాయి. అగరుబత్తీల కమ్మని పరిమళం, టేప్ రికార్డర్ మధుర సంగీతం వాతావరణాన్ని ఆహ్లాదభరితం చేస్తున్నాయి. హాల్లోకి వెళ్ళి కూర్చోగానే వెల్‌కమ్ డ్రింక్ సర్వ్ చేస్తున్నారు హోటల్ బాయ్స్. వచ్చినవారు గుసగుసలాడుకుంటున్నారు. సన్మానం ఎవరికి చేస్తున్నాడు...? ఎందుకు చేస్తున్నాడు...? మీకేమైనా తెలుసా" అని... ప్రముఖ సంఘసేవకులకా, కళాకారులకా, క్రీడాకారులకా..., ఎవరికి...? ఎవరు ఇతని ఆత్మీయులు...? ఇలా అందరూ తలోరకంగా ఊహలు సాగిస్తున్నారు. స్టేజి మీద రెండు మహారాజా కుర్చీలు వేసి ఉన్నాయి. రెండు భారీ పూలదండలు ఆ ప్రక్కనొకటి, ఈ ప్రక్కనొకటి కొక్కేలకు వ్రేలాడుతున్నాయి. 'తమని ఉపయోగించుకునేది ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తూ. అతిధులందరూ వచ్చాక, టేప్ రికార్డర్ ఆఫ్ చేసి, స్టేజ్ మీదకు వెళ్ళి, మైక్ చేతిలోకి తీసుకున్నాడు గోపి. చిరునవ్వుతో అందరినీ ఒక్కసారి కలియచూసాడు. "అందరికీ నమస్కారం. నా ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు కృతజ్ఞతలు. ముందుగా మీరు నన్ను క్షమించాలి. ఇంతవరకూ మిమ్మల్ని సస్పెన్స్‌లో పెట్టినందుకు. ఇప్పుడు మీ సందేహాలన్నిటికీ విపులంగా సమాధానం చెబుతాను. ఈ సన్మానం నన్ను కన్నవారికి. వారేం గొప్ప పని చేసారని ఈ సత్కారం అని మళ్ళీ మీకు ధర్మసందేహం కలుగవచ్చు. దానికీ జవాబు ఇస్తాను. కాకపోతే మీరు కొద్దిగా ఓపికతో వినాలి. బోర్ కొట్టించను లెండి..." అంటూ నవ్వాడు గోపి. "కానివ్... చెప్పు... చెప్పు..." అన్నారు ఇద్దరు ముగ్గురు చిన్నవాడనే చనువుతో.

**కోపూరి పుష్పాదేవి**

"నాకు నలుగురు ముఖ్య స్నేహితులు. వాళ్ళ కథలు చెబుతాను. అందరివీ మధ్య తరగతి కుటుంబాలే. ముందుగా కుమార్ గురించి.. అతనికి ఒక తమ్ముడు, ఒక చెల్లెలు. కుమార్ యావరేజ్ స్టూడెంట్. డిగ్రీ పూర్తి చేసి, ఏదో చిన్న ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. వాడి తమ్ముడు చంద్రశేఖర్. చాలా తెలివైన విద్యార్థి. ఇంటర్ లో మంచిమార్కులు తెచ్చుకున్నాడు. అయినా అతనికి డాక్టరో, ఇంజినీరో కావాలన్న కోరి కలేం లేవు. కానీ, వాళ్ళ తల్లిదండ్రులకు ఆ ఆకాంక్ష బలీయంగా ఉంది. 'ఇంతవరకూ మన వంశంలో డాక్టరో, ఇంజినీరో అయినవారు లేరు. ఎంత కష్టపడి అయినా, ఎంత ఖర్చుపెట్టి అయినా నిన్ను చదివిస్తాం. నువ్వు మా ఆశలు తీర్చాలి' అన్నారు. సరేనని, అతను యమ్సెట్ వ్రాసి, మంచి ర్యాంకు తెచ్చుకుని, యమ్.బి.బి.యస్.లో చేరాడు. సహజంగా అతనికి ఆ కోర్సు మీద ఆపేక్ష లేనందున రెండవ సంవత్సరం చాలా పేపర్లు మిగిలిపోయాయి. ఆ కోర్సు చదవడం ఇక తన వల్ల కాదనుకున్నాడు. మరో కోర్సులోకి మారాలంటే, ఈ రెండుసంవత్సరాల సమయమూ, ఖర్చుపెట్టిన ఇంత డబ్బూ వృధా అవుతాయి. ఏంచేయాలో అతనికి పాలుపోలేదు. ఒత్తిడి తట్టుకోలేక, అమ్మా నాన్నలకు ముఖం చూపలేకా ఆత్మహత్యకు ఒడికట్టాడు. ఉన్న కొద్ది స్థిరాస్థులూ పోయాయి. తమ్ముడూ పోయాడు. అప్పులు మిగిలాయి. దిగులుతో కృంగిపోయిన తల్లిదండ్రుల, చెల్లెళ్ళ బాధ్యతలు ఇప్పుడు కుమార్ నెత్తిన పడ్డాయి.

* * *


ఇక రెండవ వాడు వినోద్. వాడికి ఒక్కతే చెల్లెలు... శాంతి. ఆమె ఇంటర్ ఫస్టియర్‌లో ఉండగా, చాలా మంచి కోటీశ్వరుల సంబంధం దొరికిందని, ఆలస్యం చేస్తే చెయ్యి దాటిపోతుందని, శాంతిని చదువు మాన్పించి, అప్పులు చేసి, ఆడంబరంగా పెళ్ళి చేసారు. అమ్మాయి అత్తవారింటికి వెళ్ళి, ముచ్చటగా మూడునెలలు కాపురం చేసింది. ఒక ఘోరప్రమాదంలో శాంతి భర్త చనిపోయాడు. శాంతి కడుపులో బిడ్డతో, విధవరికంతో పుట్టింటికి చేరింది. ముక్కుపచ్చలారని పిల్ల, చేజేతులా ఆమె జీవితం నాశనం చేశామని, మనోవ్యాధితో కుంగి అమ్మా, నాన్నా మంచం పట్టారు. ఇక శాంతి పరిస్థితి చెప్పేదేముంది...? 'భర్త చనిపోతే, ఏ ఆడపిల్ల గతి అయినా, ఇంతే గదా' అని మీరు అడగవచ్చు... కానీ బాగా చదువుకుని, ఉద్యోగం చేస్తూ, తన కాళ్ళ మీద తాను నిలబడిన అమ్మాయి, తనకు వచ్చిన కష్టానికి కొన్నాళ్ళు దుఃఖపడినా చదువూ, ఉద్యోగం ఇచ్చిన ఆత్మ విశ్వాసంతో ధైర్యంతో, తుఫానులో కూలిన చెట్టు తిరిగి చిగురించినట్టు, ఛిద్రమైపోయిన తన జీవితాన్ని తాను పునర్నిర్మించుకోగలదు. కానీ..., ఇక్కడ శాంతికి వయసు లేదు, చదువు

## బద్ధకం

భవన నిర్మాణం జరుగుతోంది. కూలీలు ఇటుకలు మోస్తున్నారు. ఒక్కొక్క కూలీ ఎనిమిది ఇటుకలు చొప్పున తీసికెళ్తూండగా ఒక కూలీ మాత్రం నాలుగే తీసుకెళ్తున్నాడు. అది గమనించిన యజమాని ఆ కూలీని పిలిచాడు.

"అందరూ ఎనిమిదేసి ఇటుకలు మోస్తూంటే నువ్వు నాలుగే తీసికెళ్తున్నావేమిటి?" గద్దించాడు.

"ఆళ్లందరికీ బద్ధకం సార్! ఎక్కువసార్లు తిరగాల్సొస్తుందని ఎనిమిదేసి పట్టుకెళ్తున్నారు" అంటూ చకచకా తన దారిన వెళ్లిపోయాడు ఆ కూలీ.




లేదు, అనుభవమూ లేదు. గుండె చెదిరి, ఏ అర్ధరాత్రో ఆత్మహత్యకు సిద్ధపడుతుందేమోనని వినోద్‌కి మనశ్శాంతితో పాటు నిద్రకూడా కరువైంది.

మూడవ ఆమె కాత్యాయని. ఆమె తండ్రి సకల వ్యసన సంపన్నుడు. ఇల్లూ, ఒళ్ళూ గుల్ల చేసుకున్నాడు. ఆమె చూస్తూ చూస్తూ తల్లినీ, చెల్లెళ్ళనూ, తమ్ముళ్ళనూ గాలికి వదిలేయలేక తనపెళ్ళినే శాశ్వతంగా వదిలేసుకుంది. తండ్రి సంసారభారాన్ని నెత్తిన వేసుకుంది.

ఇక నాలుగవ వాడు ప్రవీణ్. వాడి తండ్రి లంచాలు పట్టడంలో ప్రవీణుడు. పట్టుబడి జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. అలా వాడికీ సంసార భారం తప్పలేదు.

ఇలా నా స్నేహితులు నలుగురూ వాళ్ళ కుటుంబాల సాలిగూళ్ళలో చిక్కుకుని, బయటకు రాలేక, జీవితంలో సుఖమూ, శాంతీ లేక అల మటించిపోతున్నారు. నా తల్లిదండ్రులు మాత్రం తమకు పెంచే స్తోమతులేదని గ్రహించుకుని, నా ఒక్కడితోనే సరిపెట్టుకున్నారు. నా మీద ఆంక్షలేమీ పెట్టక, నన్ను స్వేచ్ఛా పావురాన్ని చేసారు. వెర్రిఆశలు పెట్టుకోక, ఉన్న దానిలోనే సంతృప్తిగా బతకగలిగే ఆత్మవిశ్వాసాన్నిచ్చారు. నాకు దివ్యమైన జీవితాన్నిచ్చారు. పోరాడి గెలవడంలో తప్పులేదు. అది నిశ్చయంగా గొప్పవిషయమే. కాదనను. కానీ జీవితమంతా పోరాటమే అయితే ఇక జీవిత మాధుర్యం అనుభవించేదెప్పుడు...?

ఇప్పుడు చెప్పండి... నేను నా తల్లిదండ్రులకు సన్మానం చేయడంలో ఏమైనా అనౌచిత్యం ఉందా...? నాకు తెలుసు... ఉన్నదని ఎవరూ చెప్పలేరు, చెప్పరు. కనుక ఆనందంగా కార్యక్రమం తిలకించి, హాయిగా విందు స్వీకరించండి" అంటూ ఆహూతుల హర్షధ్వానాల మధ్య అమ్మా నాన్నలను ఆసనాల్లో ఆశీనులను చేసాడు గోపి.